క్లుప్తంగా

మహిళల జీవనోపాధికి రూ.8 కోట్ల స్త్రీనిధి రుణాలు

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళలకు ఆర్థికంగా సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్లు స్త్రీనిధి రుణాలను అందజేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని మందస సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండలంలోని 372 స్వయం సహాయక సంఘాలలో 1198 మంది డ్వాక్రా సభ్యులకు 2023–24 సంవత్సరంలో స్త్రీనిధి రుణాలు రూ.8.30 కోట్లు అందించి జిల్లాలో మందస మండలం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇప్పటికే 11 శాతం వడ్డీతో మహిళలకు కోటి రూపాయలు స్త్రీనిధి ద్వారా రుణాలు అందించామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


అధికారుల సమీక్షలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కవిటి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు.శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాల నేపథ్యంలో మండలస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. అన్ని పంచాయితీల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, శానిటేషన్ డ్రైవ్ కొనసాగించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ ధనంజయ మజ్జి, ఈఓపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి గ్రామానికి చెందిన శంకు కుమార స్వామి కొన్నాళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతుండటంతో గ్రామస్తులు విరాళాలు సేకరించారు. మొత్తం రూ.44,400ను బాధితుడికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సంఘాల్లో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: స్వయం శక్తి సంఘాల్లో సభ్యులు నిబంధనలు విధిగా పాటించాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. శనివారం ఇచ్ఛాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, సంఘ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు ఇచ్చారు. ఆడిట్, వార్షిక నివేదిక, కట్టుబాట్లు, రుణాలు చెల్లింపు, ఆదాయాభివృద్ధి కార్యక్రమాల ఏర్పాట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను వివరించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే– డ్రైడే కార్యక్రమంలో పాలుపంచుకోవాలని సూచించారు.

దీర్ఘకాలిక వ్యాధులపై శ్రద్ధ అవసరం


రోగుల్ని పరీక్షిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్ పట్నాయక్

కవిటి: బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగతి ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ పట్నాయక్ అన్నారు. విశాఖపట్నం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఆదేశాల మేరకు జగతి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో శనివారం సేవలు అందించారు. ప్రస్తుతం బ్రాహ్మణతర్ల ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో పనిచేస్తున్న దుర్గాప్రసాద్ పట్నాయక్‌ను మంగళ, గురు, శనివారాల్లో జగతి కేంద్రంలో సర్దుబాటు పద్ధతిలో విధులు కేటాయించారు.

పశువులకు లంపీస్కిన్ టీకాలు

టెక్కలి: సీజనల్‌గా పశువులకు వ్యాపించే లంపీస్కిన్ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని లింగాలవలస పశు వైద్యాధికారి ఎం.పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం టెక్కలి మండలం లింగాలవలస, సవరకిల్లి, తిర్లంగి గ్రామాల పరిధిలో సుమారు 200 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపీస్కిన్ నివారణలో భాగంగా సుమారు నెల రోజుల పాటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, సిబ్బంది వరలక్ష్మి, అనిల్, యోగేంద్ర, చిన్నమ్మి, గిరిబాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఆర్‌ఓబీ

- దయనీయ స్థితిలో కంచిలి–సోంపేట రైల్వే రోడ్డు ఓవర్ బ్రిడ్జి
- ఇరువైపులా జారిపోతున్న మట్టి
- ఆందోళనలో వాహనచోదకులు


కంచిలి–సోంపేట పట్టణాల మధ్య రైల్వే ట్రాక్‌పై రోడ్డు ఓవర్ బ్రిడ్జి

కంచిలి : అధికారుల నిర్లక్ష్యం వాహనచోదకుల పాలిట శాపంగా మారుతోంది. చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారి–16పైన కంచిలి, సోంపేట పట్టణాల మధ్య నిర్మించిన రైల్వే ఆర్‌ఓబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి) అధ్వాన స్థితికి చేరింది. రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ బ్రిడ్జిని 2003–04 సంవత్సరంలో జాతీయ రహదారులు నాలుగు లైన్లుగా విస్తరించిన సమయంలో నిర్మించారు. అప్పటి నిబంధనల ప్రకారం బ్రిడ్జిపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా గ్రావెల్, ఇతర మెటీరియల్‌తో బ్రిడ్జికి తగ్గట్టు ఎత్తి పెంచి నిర్మించారు. అయితే రోడ్డుకు ఇరువైపులా ప్రస్తుతం నిర్మిస్తున్న బ్రిడ్జిలకు ఉన్నట్లు సిమెంటు ప్లేట్ల ప్యాకింగ్ వంటివి ఏర్పాటు చేయలేదు. కనీసం పూర్తిస్థాయిలో రాయికట్టు కూడా నిర్మించ లేదు. దీంతో సపోర్టుగా ఉన్న మట్టి కొద్దికొద్దిగా కిందకు జారిపోతోంది. బ్రిడ్జి స్ట్రక్చర్‌లో సైతం పటుత్వం తగ్గి, పిల్లర్ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. అప్పట్లో సంబంధిత విభాగం అధికారులు బ్రిడ్జి పగుళ్ల వద్ద మరమ్మతులు చేయించి రివిట్స్ ఏర్పాటు చేశారు. అయినా మట్టి జారిపోతుండటంతో గ్రీన్‌మేట్ వేసి దానిపైన మట్టివేసి గడ్డి పెంచేందుకు ఏర్పాటు చేశారు. ఆ ప్రయత్నం కూడా ఫలించలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జికి ఇరువైపులా వేసిన మట్టి అప్రోచ్ రోడ్డు మీదకు, సోంపేట–కంచిలి రోడ్డు మార్గం మీదకు జారిపోతోంది. దీంతో వాహనచోదకులు బురదమట్టితో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న బ్రిడ్జిల మాదిరిగా సిమెంట్ ప్లేట్స్ ప్యాకింగ్ వేస్తేనే ఈ సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని పలువురు చెబుతున్నారు.


బ్రిడ్జి గోడకు వేసిన రివిట్లు


బ్రిడ్జి పిల్లర్లకు మరమ్మతులు

రాజకీయ వేధింపులు అరికట్టాలి


ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళా సమాఖ్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ 20 ఏళ్లగా సేవలందిస్తున్న వీఓఏలపై రాజకీయ వేధింపులు అరికట్టాలని సీఐటీయూ నాయకుడు ఎస్.మోహన్‌రావు కోరారు. ఈ మేరకు శనివారం వీఓఏలతో కలిసి ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ మహిళల ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగుపర్చడంలో వీఓఏలు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన మూడేళ్ల కాల పరిమితి జీఓను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ కమిటీ నిర్ణయించిన రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలతో ఎస్.ధనలక్ష్మి, డి.హేమలత, శోభారాణి, డి.సరస్వతి, బి.ఝాన్సీ, విజయ, ఏ.రత్నం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ సురేష్

వజ్రపుకొత్తూరు: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. విపత్తు నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని వీఆర్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.తిరుమలరావు, ఎంఈఓ బి.వి.రమణ, ఏఓ పి.కిరణ్‌వాణి, ఏపీఓ పి.కేశవరావు పాల్గొన్నారు.


వాడీవేడిగా మండల సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రోణంకి ఉమ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కోటబొమ్మాళి పంచాయతీ సీతన్నపేటలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల తాగునీటి కుళాయిలను టీడీపీ నేతల సిఫారసు మేరకు ఈఓ చింతాడ సన్యాసి ఇటీవల తొలగించారని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కావ్యశ్రీని ప్రశ్నించారు. ఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణచేసి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వై.పద్మజ హామీఇచ్చారు. ఎత్తురాళ్లపాడులో కూర్మసాగరం చెరువు గర్భంలో 50 సెంట్ల స్థలాన్ని టీడీపీ నాయకుడు సనపల గురయ్య ఆక్రమించుకున్నారని, దీనిపై టెక్కలి సబ్ కలెక్టర్‌కు, వీఆర్‌ఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సర్పంచ్ తలగాన గణపతిరావు తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. చెరువులో సర్వే చేపట్టి ఆక్రమణ తొలగిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ మీటర్లకు ఫీజుబులిటీ సర్టిఫికెట్లు మంజూరుచేయకుండా నెలలు తరబడి తహశీల్దార్ కొర్రీలు వేస్తున్నారని, వెంటనే మంజూరుచేయాలని చిన్నసాన ఎంపీటీసీ నంబాల్ల రాజశేఖర్ కోరారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ప్రోటోకాల్ ప్రకారం పాఠశాలల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా కేవలం టీడీపీ నాయకులనే పిలుస్తున్నారని వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి ఎంఈఓ అప్పలరాజును ప్రశ్నించారు. గృహ నిర్మాణం బిల్లులు, ఉపాధి పనులపై సభ్యులు ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న 340 క్వింటాళ్ల ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎస్.గోవిందరావు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, డీటీ కె.రాము, ఐసీడీఎస్ పీఓ చింతాడ హైమావతి, విద్యుత్‌శాఖ ఏఈ బి.వి.సురేష్, మెండ మనీషా, ఫైర్ ఎస్ఐ పి.ఆర్.రెడ్డి, గృహనిర్మాణ ఏఈ పాపినాయుడు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో స్తంభించిన సేవలు


కోటబొమ్మాళి-1 సచివాలయంలో మూలకు చేరిన కంప్యూటర్

కోటబొమ్మాళి: మండల కేంద్రం కోటబొమ్మాళిలోని 1వ సచివాలయంలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రం నెల రోజులుగా పనిచేయడం లేదు. ఎన్నికల ముందు వరకూ కొత్త ఆధార్‌కార్డులు, పేరు, చిరునామా మార్పుల కోసం వచ్చే వారితో ఈ కేంద్రం నిత్యం రద్దీగా ఉండేది. ఎన్నికల అనంతరం ఎవరూ పట్టించుకోలేదు. కంప్యూటర్ సైతం పాడైపోవడంతో ఆధార్‌సేవలు నిలిచిపోయాయి. దీంతో సుదూర ప్రాంతాలైన టెక్కలి, నరసన్నపేటలోని ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆధార్ కేంద్రం నిర్వాహకుడు ఉపేంద్రరావు వద్ద ప్రస్తావించగా కొత్త ల్యాప్‌టాప్ ఏర్పాటుచేయాలని నెల రోజుల కిందటే ఉన్నతాధికారులకు తెలియజేశామని, ఇప్పటి వరకూ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.

పెట్టుబడి సాయం అందించాలని వినతి


బెండిలో వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల హామీ మేరకు రైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20,000 తక్షణం అందజేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు టి.భాస్కరరావు, బి.రామకృష్ణ, కె.బాలాజీ, కె.సూదన్ డిమాండ్ చేసారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు, డోకులపాడు, బెండి గ్రామ సచివాలయం వద్ద రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు ఆర్.నీలాచలం, హెచ్ ముకుంద, బి.దివాకర్, బమ్మిడి ఆనందరావు, ఎస్.మోహన్‌రావు, ఎస్.బైరాగి, బి.సుగుణ, లక్ష్మీ, డి.చలపతి, డి.భానుమతి, ఈశ్వరమ్మ, డి.భాస్కరరావు, టి.మల్లేశ్వరరావు, జుత్తు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

కంచిలి: మండలంలోని మకరాంపురంలో వెలసిన షిరిడీసాయి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బెందాళం రమణసాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శిథిలావస్థలో వంతెన


బొరిగిపేట వంతెన

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం పంచాయతీ బొరిగిపేట వద్ద వంశధార కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఈ వంతెనే కీలకం. అయితే క్వారీలకు వెళ్లే భారీ వాహనాలు సైతం ఈ వంతెన పైనుంచే వెళ్తుండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీజామృతంతో నారశుద్ధి


రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసిన బీజామృతం ద్రావణంతో నార శుద్ధి చేయడం ద్వారా మొలక శాతం పెంచవచ్చని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు అన్నారు. శనివారం మశాఖపురంలో మండల వ్యవసాయాధికారి టి.భార్గవి ఆధ్వర్యంలో నార శుద్ధి కోసం 200 లీటర్ల బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు. దీని వల్ల మొలక శాతంతో పాటు ఏరు తెగులు నుంచి రక్షన పొందవచ్చన్నారు. నారుల్లో చిన్న గుడ్ల నివారణకు ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వెంకట్, ఐసీఆర్‌పీ నాగమణి, ఐబి రూప పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ శిబిరాలు

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 23న మండపల్లి, బాలకృష్ణాపురం, అరకబద్ర గ్రామ సచివాలయాలు, 24న మండపల్లి, బాలకృష్ణాపురం, తేలుకుంచి, కొళిగాం, కీర్తిపురం సచివాలయాలు, 25న కేదారిపురం, బూర్జపాడు, తేలుకుంచి, కొళిగాం, కీర్తిపురం సచివాలయాలు, 26న కేదారిపురం, బూర్జపాడు, బిర్లంగి సచివాలయాలు, 27న కేశుపురం, బిర్లంగి సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆధార్ అప్‌డేట్, చేర్పులు, మార్పులు వంటివి ఉంటే సద్వినియోగపరచుకోవాలని కోరారు.

తీరంలో అధికారుల పర్యటన


ఇద్దివానిపాలెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెం సముద్రతీరాన్ని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, అధికారులు శనివారం సాయంత్రం సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యకారులెవ్వరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ గండుపల్లి రమేష్‌కు సూచించారు.

దాతల ఔదార్యం


భోగిరాజుకు ఆర్థిక సాయమందిస్తున్న ట్రస్టు సభ్యులు


బల్లిపుట్టుగలో చాందినీ చికిత్సకు నగదు అందిస్తున్న గొండ్యాలపుట్టుగ వాసులు

కవిటి: స్పందించే హృదయం ఉంటే ఆ జీవితాలకు వెలుగులు లభిస్తాయని చాటుతూ పలువురు దాతలు తమ ఔదార్యం చూపారు. శనివారం పెద్ద బల్లిపుట్టుగలో తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోని చాందినికి గొండ్యాలపుట్టుగ గ్రామస్తులు రూ.20,000 అందించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సీహెచ్ కపాసుకుద్దికి చెందిన గనగల్ల భోగిరాజు పేదరికం సమస్యను గుర్తించిన సోంపేట మండలం ఎకువూరుకు చెందిన వీరబ్రహ్మేంద్రస్వామి చారిటబుల్ ట్రస్టు రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

సైనికుడి కుటుంబానికి చేయూత


వీర జవాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆర్మీ ఉన్నతాధికారులు

సంతబొమ్మాళి: మండలంలక్ష్మని చెట్లతాండ్ర గ్రామానికి చెందిన వీర జవాన్ డొక్కరి రాజేష్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి తక్షణ సాయం చెక్‌ను గోపాల్‌పూర్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సెంటర్ కమాండింగ్ ఆఫీసర్ ఏఎస్ బద్వాల్ మేజర్ రౌట్ శనివారం అందజేశారు. వీర జవాన్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్య, టెక్కలి డీఎస్పీ బాల చంద్రారెడ్డి, జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, పైడి మురళి, తాండ్ర జనార్దన్, టెక్కలి మాజీ సైనికుల అధ్యక్షుడు గొనప సోమేష్, సర్పంచ్ పంగా సిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో ఆదాయం


ఎఫ్‌పీఓలతో మాట్లాడుతున్న డీపీఎం నారాయణరావు

వజ్రపుకొత్తూరు: ప్రకృతి వ్యవసాయంలో మునగ సాగుతో ఆదాయం పొందవచ్చునని శ్రీకాకుళం సెర్ప్ డీపీఎం నారాయణరావు అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు మండలంలోని ఎఫ్‌పీఓ కార్యాలయం వద్ద వెలుగు సిబ్బంది, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో రూ.35 వేల పెట్టుబడితో 500 మునగ మొక్కలు పెంచితే ఒక్కో మొక్క నుంచి రూ.600 నుంచి రూ.800 వరకు ఆదాయం పొందవచ్చునని వివరించారు. ఎకరాకు లక్ష రూపాయలు వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగుకు అనుకూలంగా ఉంటుందని, చీడ పీడలు రాకుండా తగు సూచనలు ఇచ్చేందుకు ఉద్యానవన శాఖ సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు ఏపీఎం శ్రీనివాసరావు, ఎఫ్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులను వేధిస్తే చర్యలు


మాట్లాడుతున్న కాశీబుగ్గ సీడీపీఓ లావణ్య

వజ్రపుకొత్తూరు: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీఓ లావణ్య హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో లైంగిక వేధింపుల చట్టం–2013పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణకు ప్రతిచోటా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కమిటీ అధ్యక్షులుగా సీనియర్ మహిళా ఉద్యోగులతో పాటు నిబద్ధత, సామాజిక స్పృహ, చట్టాలపై అవగాహన కలిగిన మరో మహిళా ఉద్యోగి, పురుష ఉద్యోగి సభ్యులుగా ఉండాలని సూచించారు. మూడో పక్షానికి చెందిన సామాజిక కార్యకర్త, స్వచ్ఛంద సంస్థలకు కమిటీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డిక్కల తిరుమలరావు, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంఈఓలు దశరథి, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తిని కట్టడి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి

నందిగాం: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధికారులకు సూచించారు. శనివారం నందిగాం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం మహిళలపై లైంగిక వేధింపుల కట్టడికి సంబంధించి ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ డి.ఉమామహేశ్వరి, తహసీల్దారు వి.పద్మావతి, పీహెచ్‌సీ వైద్యురాలు అనిత, ధాతారాం, ఎంఈఓ జి.నర్సింహులు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే


రాజుగారిపేటవీధిలో వర్షపునీరు


సంతపేటలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఇలా..

సోంపేట/ఇచ్ఛాపురం/టెక్కలి: సోంపేట మేజర్ పంచాయతీలోని రాజుగారిపేటలో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. ముఖ్యంగా గ్రామీణ వికాస్ బ్యాంకుకు వచ్చే దారి జలమయం కావడంతో ఖాతాదారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని సంతపేట, కొండపోలమ్మకాలనీ, దాసన్నపేట, రత్తకన్న, టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.